


ఆ అమ్మాయి పేరు లావణ్య. పేరుకు తగ్గట్టు కాక ఓ మోస్తరుగా ఉంటుంది. కాని అదో సామెత లాగా! అబ్బ! సమయానికి గుర్తు రావడం లేదు. ఏదైతే ఏం లేండి! ఒకే ఒక్క లోపం. ఆర్టిస్ట్ పరధ్యానంలో ఉండి గీసినట్లుగా పాపం ముక్కు కొంచెం వంకర. "ఐమీన్" సొట్ట అంటారే అది. ఇలాంటి లోపాలను వెదకడంలో దిట్ట అయిన మా ఫ్రెండ్స్ అంతా కలిసి ఆవిడకు ఓ చక్కటి "నిక్‌నేమ్" అనబడే బిరుదును ప్రసాదించారు. వాళ్ళకు ఉందిలేండి! వి.యస్. అని ఓ పేరు. మా "కోడ్" ప్రకారం వి.యస్. (VS) అంటే వానర సైన్యమని అర్థం. ఇంతకూ ఆవిడకు పెట్టిన పేరు యస్ యమ్ యస్ (S.M.S.) ఏ మాట కామూటే-మా వాళ్ళు కారణం లేనిదే పేరు పెట్టరు. ఆవిడకు తనే తెల్లగా అందంగా ఉంటానని గర్వం. తెల్లగా ఉండే వాళ్ళంతా అందంగా ఉంటారు గామోలు! ఇలాంటి విషయాల్లో అంటే ఎవరినైనా ఏడిపించడం లాంటి వాటిల్లో నేను అంతగా కలవను. అలా చేయద్దుఇలాచెయ్యెద్దుఅంటుంటానని నన్ను ముద్దుగా "బామ్మ" అంటారు. సరే! తాము చేసిన ఘన కార్యం నాకు చెప్పి యస్ యమ్.యస్. అంటే ఏమిటో చెప్పమని నా మీదకు దాడి చేశారు.

యస్.యమ్.యస్. అంటే నాకు తెలిసింది సెప్టెంబర్. మార్చ్. సెప్టెంబర్. మీకూ తెలిసే ఉంటుంది.మరి అది ఆవిడకు సరిపోదుకదా! ఎంత ఆలోచించినా నా మొద్దు బుర్రకు తట్టలేదు. "ఇదిగో సుధా! నీవు చెప్పలేకపోయావో రేపు మా జనాన్నంతా పిక్చర్‌కి తీసుకెళ్ళాలి. రేపటి వరకు టైమ్ ఇస్తున్నాను. ఏమంటావ్?" అన్న నీరద మాటలకు.

"అమ్మా నీరద
ఇదెక్కడి బెడద
ఆపుతావా సొద
నోరు మూయవే గాడిద" అన్నాను
రాగయుక్తంగా.

"ఒసేవ్! నీ ప్రాస కోసం ప్రయాసపడి నన్ను గాడిదను చేస్తే చేశావ్‌గాని. ఎలాను ఓడిపోతావ్. అది గ్యారంటీ. కాబట్టి మనీ రెడీ చేసుకొని ఉంచు. అసలే మా "ఫేవరెట్" సినిమా! విన్ను వదిలేది లేదు" అంటూ తుర్రుమంది నీరు. ఎప్పుడూ ఇంతే! బడబడా వాగేసి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వదు. "హరి భగవాన్!" అని నిట్టూర్చి "ఆ! రేపటి వరకు "టైమ్" ఉందిగా! తమ్ముడు రవిని అడుగుదామని తేలికపడి నెమ్మదిగా ఇల్లు చేరాను. రవి అప్పుడే ఎక్కడికో వెళ్ళబోతున్నాడు. "ఒరేయ్ రోడ్లు కొలవడానికి చాలా "టైమ్" ఉందిగాని ఇలా రారా! నిన్నొకటి అడగాలి" అంటూ వాణ్ణి లోపలకు లాక్కెళ్ళాను. "నాకో హెల్ప్ చేయాలిరా! పెద్ద కష్టపడక్కరలేదులే!" అంటున్న నా మాటలకు అడ్డొస్తూ "ఆ.... ...ఆ.... నేను అనుకుంటూనే ఉన్నాను. మీ వి.యస్ లు మళ్ళీ ఏదో తమరి పర్స్ ఖాళీచేయించే ప్లాన్ వేసుంటారని — నాన్చకుండా విషయమేమిటో త్వరగా చెప్పవే తల్లీ! మా ఫ్రెండ్స్ ఎదురు చూస్తుంటారు!" అంటున్న వాడితో "సరే! యస్.యమ్ యస్. అంటే ఏమిటో చెప్పు చూద్దాం!" "ఓసోస్! ఇంతేనా! సుగంధ మకరంద సుభాషిణి. దీనికేనా! ఇంత గొడవ చేశావు! నేపోతున్నానంటూ వెళ్తున్న వాడిని "నీవు చెప్పింది కరక్టేనా" అని వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు వాడు.

రవి చెప్పింది కరక్టే నన్న ధీమాతో మర్నాడు పిక్చర్‌కి సరిపడ మనీ మాత్రమే తీసుకొని నీరదా వాళ్ళింటికి బయలుదేరాను. పర్స్ ఖాళీ! అన్న బెంగతో వాళ్ళ ఇల్లు చేరాను. అప్పటికే వి యస్ లంతా చేరిపోయారు. "అదిగో! సుధొస్తుంది. లేవండర్రా ఇక బయలుదేరుదాం" అంటూ లేస్తున్న వాళ్ళను, "ఏమిటే! నేను అంత బుర్రలేకుండా ఉన్నాననుకుంటున్నారా? ఇదిగో చెబుతున్నా వినండి — యస్ యమ్. యస్. అంటే సుగంధ.మకరంద సుభాషిణి"

"అబ్బ! ఏం గొప్పగా చెప్పావే! తమ్ముడు గారి తెలివా? నడు నడు" అంటూ ఊపిరాడనివ్వకుండా లాక్కెళ్ళారు. మొత్తానికి చెత్త సినిమా చూసి పర్స్ ఖాళీచేయించుకొని బయటపడ్డాను అప్పుడు గుర్తొచ్చింది. ఇంతకూ వీళ్ళు అసలు విషయం చెప్పలేదని. "అమ్మా! సుధా! సావధానముగా వినుము. యస్ యమ్ యస్. అనగా "సొట్టముక్కు సుందరి" అన్నారు కోరస్‌గా. అయ్యో! ఇంతేనా! ఆ ఆలోచనరానందుకు తిట్టుకుంటూ ఇంటిదారి పట్టాను.